## రామంతాపూర్ బైపాస్ రోడ్డులో ఇరిగేషన్ నాలాపై ఆక్రమణలు..!

# రోడ్లపైకి వర్షం నీరు.. పూడికతీత పనులకు ఆటంకం



రామంతాపూర్ బైపాస్ రోడ్డులో ఇరిగేషన్ నాలా ఆక్రమించి వేసిన పైపులు



నాలా ఆక్రమించడంతో వర్షం నీరు రోడ్డుపైకి చేరిన దృశ్యం.

**ఉప్పల్, మే 29 ప్రభాతవార్త :** రామంతాపూర్ బైపాస్ రోడ్డు వెంట ఉన్న ఇరిగేషన్ నాలా ఆక్రమించి యధేచ్ఛగా అక్రమణలు జరుగుతున్నాయి. అంబర్‌పేట అలీ కేఫ్ నుంచి రామంతాపూర్ కెసిఆర్ నగర్ మీదుగా ఉప్పల్ మెట్రో స్టేషన్ వరకు రెండు ఇరిగేషన్ నాలాలు ఉన్నాయి. గతంలో రెండు నాలాలు ఇక్కడ ఉండగా, ప్రస్తుతం ఒక నాలా పూడ్చివేసి రోడ్డు వేశారు. మరో నాలా వెంట ఆక్రమణల కారణంగా కుంచించుకునిపోయి చిన్నగా మారిపోయింది. శ్రీనగర్ కాలనీ, టివికాలనీ ఎదురుగా ఉన్న కెసిఆర్‌నగర్, కెటిఆర్‌నగర్ తదితర పేర్లతో అనుమతి లేని లేఅవుట్‌ల వెంట కాలనీలు వెలిశాయి. ఇందులో నిర్మాణాలు చేసిన వారికి అధికారులు ఎటువంటి అనుమతులు ఇవ్వడం లేదు. దీంతో ఒక్కో భవనం మూడు, ఐదు అంతస్థులు నిర్మించి నివాసం ఉంటున్నారు. కొందరు అద్దెలు ఇస్తున్నారు. గతంలో గడ్డి పొలాలు ఉన్న ఈ కాలనీ వెంట అనుమతి లేకుండా షెడ్లు, కట్టెకోత మిషన్లు, బిస్కెట్ కంపెనీలు కూడా ఏర్పాటు చేశారు. అయితే ఈ కాలనీలకు వెళ్లేందుకు గతంలో అధికారులు ఒకటి రెండు చోట్ల నాలాలపై అధికారికంగా కల్వర్టులు నిర్మించారు. దీనిని అసరాగా చేసుకుని పలు చోట్ల అనుమతి లేకుండా ఇరిగేషన్ నాలాలపై పైపులు వేసి నిర్మాణాలు చేశారు. దీని కారణంగా వర్షం పడిన సమయంలో వరద నీరు రోడ్లపైకి చేరి రోడ్ల వెంట నిలిచిపోతుంది. దీంతో అధికారులు అప్పటికప్పుడు తూతూమంత్రంగా పనులు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు. కొందరు కింది స్థాయి నేతల సహకారంతో నాలాల వెంట పైపులు వేసి అక్రమణలు చేపడుతున్నారు.

**నాలా ఆక్రమణలతో రోడ్లపైకి వర్షం నీరు :** రామంతాపూర్ బైపాస్ వెంట ఉన్న నాలాలు ఆక్రమించి పైపులు వేయడం వల్ల పలు చోట్ల వర్షం నీరు వెళ్లేందుకు వీలు లేక రోడ్లపైకి వస్తోంది. ఇరిగేషన్, జిహెచ్‌ఎంసి అధికారులు నాలాలు ఆక్రమించిన సమయంలో పట్టించుకోకపోవడంతో వర్షం వచ్చిన ప్రతిసారి రోడ్లుపై వరద నీటితో ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో గడ్డి సాగు కోసం నాలాల వెంట నీరు వెళ్లేందుకు పలు చోట్ల ఏర్పాటు చేయగా, ప్రస్తుతం గడ్డి సాగు లేకుండా పోయింది. అనుమతి లేకుండానే ఇళ్ల నిర్మాణాలు చేయడంతోపాటు, నాలాలు ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వస్తున్నాయి. అధికారులు స్పందించి దీనిపై తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**తూతూమంత్రంగా నాలా పూడికతీత పనులు :** ఉప్పల్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నాలా పూడికతీత పనులు తూతూమంత్రంగా సాగుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. నాలాలు ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నా పట్టించుకోని అధికారులు పూడికతీత పనులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గతంలో రామంతాపూర్‌లోని పలు కాలనీలు వరద నీటితో ఇబ్బందులు పడిన సంఘటనలు ఉన్నాయి. ఇరిగేషన్, మున్సిపల్ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం వల్లే ఇటువంటి సమస్యలు వస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

## వరదనీటి సమస్యలు పరిష్కరిస్తా : ఎమ్మెల్యే



కాలనీవాసులతో సమస్యలపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

**వనస్థలిపురం, మే 29 ప్రభాతవార్త:** ఎల్.బి.నగర్ నియోజకవర్గ పరిధిలోని అన్ని కాలనీలలో వరద నీటి సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని హైకోర్టు కాలనీ, బి.డి.ఎల్.కాలనీవాసుల విన్నపంమేరకు కాలనీలలో పర్యటించారు. కాలనీవాసులు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ పక్క కాలనీ నుండి వచ్చే వరదనీటివల్ల మా కాలనీలలో కొన్ని ప్రాంతాల్లో ఇండ్లు, కమ్యూనిటి కేంద్రాలు, దేవాలయం నీట మునుగుతున్నాయని, నూతన ట్రంక్ లైన్ నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ మీ కాలనీ సమస్యలపై పూర్తి అవగాహన ఉందని తెలిపారు. గతంలోనే ట్రంక్ లైన్ మంజూరు చేయడం జరిగిందని, ట్రంక్ లైన్ నిర్మాణంలో భాగంగా పక్కన ఉన్న ఒక ప్రైవేట్ యాజమాన్యం స్థలం అడిగామని వారు నిరాకరించడంతో పనుల్లో ఆలస్యం జరిగిందని తెలిపారు. అదే సమయంలో విధి నిర్వహణలో ఉన్న అధికారులు అక్కడికి రావడం జరిగింది. నూతన ట్రంక్ లైన్ పనుల్లో భాగంగా ఎత్తుపల్లాలు చూసుకొని పనులు చేయాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. నియోజకవర్గ పరిధిలో వరదనీటి సమస్యలు లేకుండా పరిష్కారం చేయడం జరుగుతుందని, పనుల్లో కొంత జాప్యం జరుగుతోందని వాటికి కాలనీవాసులు సహాయ, సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఈఈ రమేష్‌బాబు, ఏ.ఈ. చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు దీపావళి శ్రవణ్, దీపావళి శ్రీకాంత్, కాలనీవాసులు సుధీర్‌రెడ్డి, శ్రీనివాస్, మోహన్ రెడ్డి, మురళి, శంకర్‌రెడ్డి, చంద్రశేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు పూర్తి చేయించి అందుబాటులో తెస్తాం: సబితా ఇంద్రారెడ్డి



బడంగ్‌పేట్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను పరిశీలిస్తున్న సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, మే 29 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్‌లో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తేవాలని ఎమ్మెల్యే, మాజీ మంత్రి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి అధికారులకు సూచించారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బడంగ్‌పేట్ దావూద్‌ఖాన్‌గూడలో రూ.4 కోట్లతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మార్కెట్ యార్డులో పర్యటించి పనులను పర్యవేక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మాజీ సిఎం కెసిఆర్ చొరవతో నియోజకవర్గానికి మొత్తం 4 ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు మంజూరుకాగా అందులో బడంగ్‌పేట్, తుక్కుగూడలలో మాత్రమే నిర్మాణంలో ఉన్నాయన్నారు. ఈ మార్కెట్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయించి ప్రజలకు ఉపయోగపడేలా చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ మేరకు అధికారులు సంబంధిత కాంట్రాక్టర్‌చే పనులు సకాలంలో పూర్తి అయ్యేటట్లు చేయాలని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పెద్దబావి ఆనంద్‌రెడ్డి, భీమిడి జంగారెడ్డి, రామిడి రాంరెడ్డి, సంరెడ్డి వెంకట్‌రెడ్డి, బోయపల్లి శేఖర్‌రెడ్డి, పుట్టగళ్ళ సంతోష్, సిల్వేరి సాంబశివ, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థ బీసీ రిజర్వేషన్లు, వర్గీకరణకు సిఎం సలహాదారులు వేముల సానుకూలత



నరేందర్‌రెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న సంఘాల ప్రతినిధులు

**తుర్కయాంజాల్, మే 29 ప్రభాతవార్త :** వెనకబడిన తరగతుల స్థానిక సంస్థల రిజర్వేషన్లను ఏ,బి,సి,డి వర్గీకరణ చేయాలని బుధవారం వివిధ వృత్తి సంఘాల రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ మాదాపూర్‌లోని ముఖ్యమంత్రి సలహాదారులు వేముల నరేందర్‌రెడ్డిని తన నివాసంలో కలిసి వినతి పత్రం అందించారు. నరేందర్‌రెడ్డి స్పందిస్తూ స్థానిక సంస్థల బీసీ రిజర్వేషన్ల వర్గీకరణ అంశం న్యాయమైనదని, వాటిని అందరికీ అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఈ అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువస్తానని సంఘాల ప్రతినిధులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిసి ఏ కులాల పరిరక్షణ సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ బాగయ్య, తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ళ ఆశయ్య, మేదరి మహేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు జగ్రిగల శ్రీనివాస్, ప్రదేశ్ గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు గడప శ్రీహరి, యూత్ ప్రెసిడెంట్ సుధాకర్, వడ్డెర వృత్తిదారుల సంఘం ప్రధాన కార్యదర్శి పల్లపు విగ్నేష్, తెలంగాణ నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ నాగరాజు, తెలంగాణ క్షౌరవృత్తిదాల సంఘం రాష్ట్ర కార్యదర్శి చెన్నారం మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి మహిళా నేత జ్యోతికి నేతల పరామర్శ

**ఉప్పల్, మే 29 ప్రభాతవార్త :** రామంతాపూర్ వెంకట్‌రెడ్డినగర్‌కు చెందిన బిజెపి మహిళా నేత జ్యోతి రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో బుధవారం బిజెపి మహిళాధ్యక్షురాలు డా.శిల్పారెడ్డి,హబ్సిగూడ కార్పొరేటర్ డా.శిల్పారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో ప్రమాదవశాత్తు జ్యోతి గాయపడ్డారని, ఆమెకు పార్టీ చేయూత అందిస్తుందన్నారు. పార్టీకోసం పనిచేసే వారికి గుర్తింపుంటుందన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి అసెంబ్లీ కన్వీనర్ అనితా పద్మారెడ్డి, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ పద్మ, రాగి లతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సంతోష్‌కు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పరామర్శ

**ఉప్పల్, మే 29 ప్రభాతవార్త :** క్రికెట్ వివాదంలో గాయపడిన బిఆర్ఎస్ నేత ఈగ సంతోష్‌ను బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరామర్శించారు. ఉప్పల్ టిఎక్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంతోష్‌ను ఆయన పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉప్పల్‌లో అల్లరి మూకల దాడులు పెరిగిపోతున్నాయని, సంతోష్‌పై దాడి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పోలీసులను అదేశించారు. దీనిపై విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు ఆకుల మహేందర్, మేకల మధుసూధన్‌రెడ్డి, గోనె అర్జున్‌రెడ్డి, శ్రీనివాసాచారి, కె.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధి మార్గాలతో మహిళలు ఆర్థికంగా ఎదగాలి : కొత్తపల్లి జైపాల్‌రెడ్డి



సర్టిఫికెట్లు పొందిన మహిళలతో జైపాల్‌రెడ్డి, ఇతర నాయకులు

**హయత్‌నగర్, మే 29 ప్రభాతవార్త:** మహిళలు స్వయం ఉపాధి మార్గాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని కాంగ్రెస్ పార్టీ పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ కమిటీ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, 3వార్డు కౌన్సిలర్ మోతె మణెమ్మ రామలింగం అన్నారు. త్రిశూల్ రూరల్ ఎడ్యుకేషనల్ ఎకనామిక్ సొసైటీ(ట్రీస్)ఆధ్వర్యంలో నెహ్రూ యువకేంద్ర సహకారంతో మున్సిపాలిటీ పరిధి 3వ వార్డు కళానగర్‌లో మహిళలకు మూడునెలల పాటు టైలరింగ్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణా శిబిరం ముగింపు సందర్భంగా వారికి సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రైవేటు రంగంలో టైలరింగ్ నేర్చుకున్న వారికి ఎన్నో అవకాశాలున్నాయని తెలిపారు. అవకాశాలను అందిపుచ్చుకుని మహిళలు సమాజంలో తలెత్తుకు తిరిగేలా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు శంకరయ్యగౌడ్, ట్రీస్ సొసైటీ ఛైర్మన్ మదన్ పాల్గొన్నారు.

## మల్కాజిగిరిలో బిజెపి జెండా ఎగురవేస్తాం : మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి



సమావేశంలో ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, మే 29 ప్రభాతవార్త :** మల్కాజిగిరిలో బిజెపి జెండా ఎగురవేస్తున్నామని, పార్టీ కార్యకర్తలు నాయకులు శక్తి వంచన లేకుండా పనిచేశారని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం హబ్సిగూడలో జరిగిన బిజెపి ముఖ్య నేతల సమావేశంలో బిజెపి మహిళా అధ్యక్షురాలు డా.మేకల శిల్పారెడ్డి, కార్పొరేటర్లు బండారు శ్రీవాణి, కక్కిరేణి చేతన, సీనియర్ నేతలు తిండేరు హన్మంతరావు, మార్నేని పణీందర్, పద్మారెడ్డి, పలువురు బిజెపి డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు, ఇతర నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బిజెపికి ప్రజలలో మంచి ఆదరణ ఉందని, పార్టీని గెలిపించేందుకు ప్రతి ఒక్కరు పనిచేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉప్పల్ భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ సమస్యలపై ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి వినతి



ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఉప్పల్ భగాయత్ నేతలు

**ఉప్పల్, మే 29 ప్రభాతవార్త :** ఉప్పల్ భగాయత్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భగాయత్ అసోసియేషన్ నేతలు బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఉప్పల్ భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ మేకల మధుసూధన్ రెడ్డి, కమిటి సభ్యులు గోనె అర్జున్‌రెడ్డి, శ్రీనివాసరావు, బంగ్లా శ్రీనివాస్‌రెడ్డి, పిల్లి నాగరాజు, నవీన్, సురేందర్‌రెడ్డి, చింతల నరసింహారెడ్డి, శోభ, రవళి తదితరుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఉప్పల్ భగాయత్‌లో జిహెచ్‌ఎంసి అధికారులు ఆస్తిపన్నులు వసూలు చేస్తున్నారని, కనీసం రోడ్లు, డ్రైనేజీ, నీటి సమస్య పరిష్కరించడం లేదన్నారు. డ్రైనేజీ అవుట్‌లెట్ కనెక్షన్ లేకపోవడంతో ఎక్కడ పడితే అక్కడ మ్యాన్‌హోల్స్ పొంగిపోతున్నాయని విన్నవించారు. వర్షాకాలంలో రోడ్లు వెంట నీరు నిండిపోతుందని, దీనిపై జలమండలి, జిహెచ్‌ఎంసి అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. భగాయత్ కాలనీలో ఇళ్లు నిర్మించుకున్న వారికి ఇంటి నెంబర్ కోసం దరఖాస్తు చేసుకుంటే పక్క కాలనీలకు చెందిన పేర్లతో ఇంటి నెంబర్లు ఇస్తున్నారని తెలిపారు. సుమారు 433 ఎకరాల్లో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన లేఅవుట్‌లో భగాయత్ కాలనీ పేరు కాకుండా ఇతర కాలనీల పేర్లు రావడం సరికాదన్నారు.దీనిపై హెచ్ఎండిఏ, మున్సిపల్ అధికారుల మధ్య సమన్వయ లోపం ఉందని, దీనిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ త్వరలోనే అధికారులతో చర్చించి సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు భగాయత్ అసోసియేషన్ నేతలు పాల్గొన్నారు.

## ఇంటర్ ప్రశ్నపత్రాల వాల్యుయేషన్ తప్పులపై విచారణ జరిపించాలి

### నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలి

**తుర్కయంజాల్, మే 29 ప్రభాతవార్త:** ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారుల నిర్లక్ష్యం, ఇంటర్ ప్రశ్నాపత్రాల వాల్యుయేషన్ చేసిన వారు అలసత్వం వహించి తప్పులుగా ప్రశ్నాపత్రాలు దిద్దడంవల్ల వేలాది మంది విద్యార్థులకు నష్టం వాటిల్లిందని మెరిట్ స్టూడెంట్ విద్యార్థికి మొదటి సంవత్సరంలో వచ్చిన మార్కులు రెండో సంవత్సరంలో వచ్చిన మార్కులు చూస్తే చాలా విచిత్రంగా ఉందని విద్యార్థులు తమకు ఏ సబ్జెక్ట్‌లో ఎన్ని మార్కులు వస్తాయో ముందే పరీక్ష రాశాక ఊహించుకుంటారని ఫలితాలు అనంతరం మార్కులు చూసి షాక్‌కు గురయ్యారని రివాల్యుయేషన్, పేపర్ వాల్యుయేషన్‌లో ఇష్టానుసారంగా పేపర్లు దిద్దారని వచ్చిన మార్కులు ఒకటైతే ఆన్‌లైన్‌లో ఇంకో రకంగా మార్కులు వేశారని, ఇంటర్ ప్రశ్నాపత్రాల వాల్యుయేషన్ ఇష్టానుసారంగా చేసి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడిన వారిని గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకొవాలని, తప్పుడు వాల్యుయేషన్‌వల్ల నష్టపోయిన విద్యార్థులందరికీ ఇంటర్ బోర్డు న్యాయం చేయాలని, లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ బోర్డు ముట్టడిస్తామని శివకుమార్ హెచ్చరించారు.

## మహిళలు బాగా చదువుకుని అన్ని రంగాల్లో రాణించాలి : ఎమ్మెల్యే బలాల



పైలెట్ నోహాఖాన్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే బలాల తదితరులు

**మలక్‌పేట, మే 29 ప్రభాతవార్త :** మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మలక్‌పేట నియోజకవర్గ ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. పైలెట్‌గా నియమితులైన నోహాఖాన్‌ను ఎమ్మెల్యే బలాల పుష్పగుచ్ఛాలను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని కోరారు. మహిళలు బాగా చదువుకుని అత్యున్నత శిఖరాలకు చేరుకోవాలని పేర్కొన్నారు. మహిళలకు తమవంతు సహాయ సహకారాలు అందించడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జాఫర్, నసర్‌ఖాన్, అసాద్‌ఖాన్, మహ్మద్ తాహెర్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలి : అబ్రార్



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న అబ్రార్ తదితరులు

**మలక్‌పేట, మే 29 ప్రభాతవార్త :** పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని అంజపుర డివిజన్ ఎంఐఎం నాయకుడు అబ్రార్ పేర్కొన్నారు. అజంపుర డివిజన్‌లోని చంచల్‌గూడలో కొనసాగుతున్న సివరేజ్ పైప్ లైన్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేగవంతంగా అభివృద్ధి పనులను చేపట్టలని అధికారులకు సూచించారు. త్వరలో మరిన్ని అభివృద్ధి పనులను చేపట్టడానికి ప్రణాళికలను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు.

## యోగాతో మానసిక శారీరక ఉల్లాసం



యోగ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, మే 29 ప్రభాతవార్త:** యోగ ద్వారా మానసిక శారీరక ఉల్లాసం కలుగుతుందని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. బడంగ్‌పేట్, కర్మన్‌ఘాట్‌లలోని లోటస్ ల్యాప్ పాఠశాలల్లో జూన్ ఒకటవ తేదీ నుండి పదవ తేదీ వరకు గురు నిలయం ఆధ్వర్యంలో ప్రారంభంకానున్న బాలల వ్యక్తిత్వ వికాస యోగ శిక్షణా తరగతులకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం మేయర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగ అభ్యాసం చేయాలని సూచించారు. యోగతో మంచి ఫలితాలు ఉంటాయని ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇస్మాయిల్ గురూజీ, భాగ్యరాజు, నరేంద్రరావు, గట్టు బాలకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మీర్‌పేట్‌లో కనులపండువగా సిద్ధి, బుద్ధి, గణపతి కళ్యాణోత్సవం

**సరూర్‌నగర్, మే 29 ప్రభాతవార్త:** మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని శివసాయినగర్ కాలనీలో శ్రీ సిద్ధి, బుద్ధి, గణపతి కళ్యాణం కనుల పండవగా జరిగింది. శ్రీ గౌరీ నీలకంఠేశ్వర స్వామి సమేత శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో ఆలయ ఛైర్మన్ తీగల సుభాష్‌రెడ్డి, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ 11వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని హాజరైన భక్తుల సమక్షంలో సిద్ధి, బుద్ధి, గణపతి కళ్యాణాన్ని వేద పండితులు శాస్త్రోకంగా నిర్వహించారు. కళ్యాణోత్సవంలో మీర్‌పేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు సంతోష్‌రెడ్డి, ఎంవి కృష్ణారావు, వెంకట రమణ, శివసాయినగర్ కాలనీ అధ్యక్షుడు శ్యామ్, 28వ డివిజన్ బిఆర్ఎస్ ఇంఛార్జి బలరామ కృష్ణ, దీక్షిత్, సుబ్రమణ్యంలతో పాటు పెద్ద సంఖ్యలో కాలనీవాసులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## యువత చెడు వ్యవసాలకు బానిసలు కావద్దు : యెల్మేటి అమరేందర్‌రెడ్డి



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న యెల్మేటి అమరేందర్‌రెడ్డి

**సరూర్‌నగర్, మే 29 ప్రభాతవార్త:** యువత చెడు అలవాట్లకు బానిసలు కావద్దని టిపిసిసి కార్యదర్శి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే యెల్మేటి అమరేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. జల్‌పల్లి మున్సిపాలిటీలో మైనారిటీ నాయకుడు తాహెర్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంఐఎ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతుల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విజేతలకు ట్రోఫీలు అందజేశారు. అనంతరం అమరేందర్‌రెడ్డి మాట్లాడుతూ యువజన సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మతిన్ షరీఫ్, రషీద్ ఖాన్, అహ్మద్ బామ్, మురళి, జగన్‌గౌడ్, జగదీశ్‌గౌడ్, సలీం, అబూబిన్ తదితరులు పాల్గొన్నారు.

## బహుముఖ ప్రజ్ఞాశాలి సురవరం : ఉప్పల



సురవరం ప్రతాపరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉప్పల తదితరులు

**ఎల్‌బినగర్, మే 29 ప్రభాతవార్త:** పత్రికా సంపాదకుడు, పండితుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి సురవరం ప్రతాపరెడ్డి అని రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త పేర్కొన్నారు. మంగళవారం నాగోల్ కోఆపరేటివ్ బ్యాంక్ కాలనీలో ప్రముఖ సాంస్కృతిక సంస్థ ఆకృతి ఆధ్వర్యంలో సుప్రసిద్ద సాహితీ వేత్త సురవరం ప్రతాపరెడ్డి 128వ జయంతి ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాస్‌గుప్త మాట్లాడుతూ, ఆనాటి నిజాం నిరంకుశ పాలనలో సామాన్య ప్రజల అణచివేతని వ్యతిరేకిస్తూ, సురవరం ప్రజలను చైతన్య వంతులను చేశారన్నారు.. తెలంగాణాలో కవులే లేరనే నింద వ్యాఖ్యలను సవాలుగా తీసుకొని, 'గోల్కొండ కవుల చరిత్ర' పేరిట పలు కవుల రచనల సంచికగా వెలువరించారన్నారు. అన్యాయాలకు వ్యతిరేకంగా తన రచనా పటిమతో నిత్యం పోరాటం చేసిన కలం యోధుడు సురవరం అన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ప్రభుత్వ సిటీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ కోయి కోటేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ చైతన్యానికి సురవరం ప్రతాపరెడ్డి తల్లి వేరు లాంటివారని అన్నారు. తెలుగుభాషా సాహిత్యాల వికాసానికి ఆయన చారిత్రాత్మకమైన కృషి చేశారని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఆకృతి సుధాకర్ సురవరం ప్రతాపరెడ్డి గొప్ప సాహితీ మార్గదర్శి అన్నారు.. ఈ కార్య క్రమంలో మదర్ థెరీసా ఫౌండేషన్ అధ్యక్షుడు చేపురి శంకర్‌తో పాటు సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

## గుడిసె వాసులకు న్యాయం చేయాలి



తడిసిన బియ్యాన్ని పరిశీలిస్తున్న రవీంద్రాచారి

**హయత్‌నగర్, మే 29 ప్రభాతవార్త:** పెనుగాలులు, భారీ వర్షానికి అతలాకుతలమైన రావినారాయణరెడ్డికాలనీ ఫేజ్-3లో నివసించే పేదలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రాచారి అన్నారు.ఆదివారం సాయంత్రం వీచిన గాలులకు కుంట్లూర్ గ్రామపరిధి రావినారాయణరెడ్డి కాలనీ భూదాన భూమిలో వేసిన గుడిసెలు చాలావరకు నేలమట్టమయ్యాయి. గుడిసెల్లోని వస్తువులు, బియ్యం తడిసిపోయాయి. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు సోమవారం గుడిసెవాసులను పరమర్శించి వారికి తక్షణ సహాయంగా బియ్యం, పప్పులు, నూనెలను అందించారు. ఈ సందర్భంగా రవీంద్రాచారి మాట్లాడుతూ... 18 నెలలుగా గుడిసెలు వేసుకుని భూపోరాటం చేస్తున్నా అధికారులు వారికి కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. గత ప్రభుత్వం నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇస్తానని హామీనిచ్చి మోసం చేసిందని, ప్రస్తుత ప్రభుత్వ పెద్దలు పేదల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు హరిసింగ్‌నాయక్, సైదులు, దాసరిప్రసాద్, సక్రునాయక్, నారాయణ, నర్సింహ పాల్గొన్నారు.